# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

# ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**విజయవాడ,**

**తేది: 9 జూన్, 2021.**

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గారికి,**

గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : పాఠశాల విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తలపెడుతున్న మార్పుల గురించి...**

**ఆర్యా!**

తేది. 31.05.2021న హడావుడిగా పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన సర్క్యులర్ పాఠశాల విద్యలో అనేక మార్పులను ప్రతిపాదిస్తూ వచ్చే విద్యా సంవత్సరం నుండే (2021-22) వాటిని అమలు చేయనున్నట్టు సూచించింది.

ఉపాధ్యాయులను, విద్యారంగ నిపుణులను, శాసనమండలి సభ్యులను, విద్యార్థి సంఘాలను, అంగన్‌వాడీ సంఘాలను సంప్రదించి వారి అభిప్రాయాలకు, అభ్యంతరాలకు తగు విలువనిచ్చి సముచితమైన, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం చేయవలసిన అంశం ఇది. పునాది నుండీ విద్యా వ్యవస్థలో మార్పులు తలపెట్టినప్పుడు ఆ మార్పుల స్వల్పకాల, దీర్ఘకాల పర్యవసానాలు ఏ విధంగా ఉండబోతున్నాయో చూడాలి. ప్రస్తుతం కరోనా మహమ్మారి రెండో వేవ్ ఉధృతి కొనసాగుతోంది. మరో రెండు, మూడు నెలల్లో మూడో విడత కరోనా విజృంభించే అవకాశం గురించి అందరూ హెచ్చరిస్తున్నారు. పైగా ఈ మారు చిన్నపిల్లలకు ఎక్కువగా సోకే ప్రమాదం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు. మన భావి పౌరులను ముందు ఈ కరోనా ప్రమాదం నుండి ఏ విధంగా కాపాడుకోవాలో దానిమీద దృష్టి పెట్టకుండా ఇంత హడావుడిగా పాఠశాల విద్యారంగంలో మౌలిక మార్పులకోసం తొందరపడడం అనుచితం అని భావిస్తున్నాము.

కరోనా రెండో విడత ప్రమాదాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం, ఆ సమయంలోనే, రాష్ట్రాలకు విద్యారంగంలో ఉన్న రాజ్యాంగపరమైన హక్కులను సైతం ప్రక్కనబెట్టి రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం పొందకుండానే ఇసిసిఇ కి సంబంధించిన సూచనలు జారీ చేయడం దుర్మార్గం. నేరుగా రాష్ట్రాల విద్యాశాఖ అధికారులతో కేంద్ర విద్యామంత్రి సమావేశాలు జరపడం రాజ్యాంగ ఫెడరల్ స్వభావం పైన, రాష్ట్రాల హక్కులపైన దాడిగా పరిగణించాలి. అటువంటి పరిస్థితుల్లో కనీసమైన నిరసన కూడా తెలియజేయకుండా కేంద్రం ఆదేశాలను అమలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము.

కేంద్రం రూపొందించిన నూతన విద్యావిధానం అనేక విషయాలలో తిరోగమన స్వభావాన్ని కలిగి వుంది. సమాజంలో వెనకబడిన తరగతులకు, మైనారిటీలకు, పేదలకు ప్రామాణికమైన విద్యను దూరం చేయడం ఆ విధానం లక్ష్యం. మన రాష్ట్రంలో పలువురు విద్యావేత్తలు ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా గతంలో తెచ్చారు. అయినా ఆ విధానాన్నే ఇక్కడ అందికంటే ముందుగా అమలు చేయబూనుకోవడం గర్హనీయం.

కొత్తగా తలపెట్టిన మార్పుల ఫలితంగా రాబోయే కాలంలో ఉపాధ్యాయ నియామకాలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. నిరుద్యోగులకు ఇది ఆశనిపాతం వంటిది. 3వ తరగతి నుండి పిల్లలు 3 కి.మీ., ఇంకా ఎక్కువ దూరాలకు పోయి చదువుకోవల్సిన అగత్యాన్ని ఈ కొత్త విధానం కల్పిస్తున్నది. ఫలితంగా ఎక్కువమంది పేద, దళిత, బలహీనవర్గాల పిల్లలు డ్రాపౌట్స్‌గా తయారవుతారు, చదువుకు దూరమౌతారు.

కనుక పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయకుండా నిలుపు చేయాలని, విస్తృత స్థాయిలో వివరంగా చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యంగా, భావితరాలకు ప్రయోజనకరంగా అవసరమైన మేరకు మార్పులను ఆ తర్వాతనే చేయాలని, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కోరుతోంది.

అభివందనములతో...

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి